మూడోవారంలోనే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్

- కసరత్తు పూర్తిచేసిన ఎన్నికల కమిషన్
- పరిస్థితులను అనుకూలంగా మార్చుకొనే యోచనలో కేంద్రంలోని మోదీ సర్కారు
- అద్వానీకి 'భారతరత్న' మరో వ్యూహం!

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): ఈ నెల మూడోవారంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రాబోతున్నది. ప్రస్తుత లోక్‌సభ బడ్జెట్ సమావేశాలు 8 లేదంటే 9న వాయిదాపడే అవకాశం ఉన్నది. ఆ వెంటనే షెడ్యూల్ ప్రకటన ఉంటుందని సమాచారం. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఆ మేరకు కసరత్తు పూర్తిచేసిందని, కేంద్రం నుంచి సంకేతాలు అందగానే ప్రకటిస్తుందని చెప్తున్నారు. నిజానికి ఈ నెల 18 లేదా 19నే షెడ్యూల్ విడుదలవుతుందని భావించారు. 2019లో ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు మొత్తం ఏడు విడతల్లో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. మే 23న ఫలితాలు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 24 తర్వాతే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. 17వ లోక్‌సభ గడువు ముగిసేలోగానే 18వ లోక్‌సభ ఎన్నికలు ముగించి ఫలితాలు ప్రకటించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

పక్కా వ్యూహంతో ముందుకెళ్తున్న బీజేపీ

ఈ ఎన్నికల్లోనూ గెలిచి హ్యాట్రిక్ సాధించాలని బీజేపీ పావులు కదుపుతున్నది. పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకొంటున్నది. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవంతో దేశం మొత్తాన్ని తమవైపు తిప్పుకోవడంలో సక్సెస్ అయిన బీజేపీ ఎన్నికలకు వరకు అదే మంత్రాన్ని కొనసాగించాలని యోచిస్తున్నది. జనవరి 22న అయోధ్య రామాలయాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. అక్కడ మొదలైన రామోత్సవం ఈ నెల 24 వరకు కొనసాగుతుంది. ప్రజలను నెలపాటు రామయ్య భక్తిలో ఓలలాడేలా చేస్తున్న మోదీ ప్రభుత్వం తాజాగా సీనియర్ నేత ఎల్‌కే అద్వానీకి 'భారతరత్న' ప్రకటించడం ద్వారా ప్రజల్లో కాస్తోకూస్తో ఉన్న వ్యతిరేకతను కూడా పోగొట్టుకునే ప్రయత్నం చేస్తున్నది. అయోధ్యలో రామయ్య ఆలయం కోసం అద్వానీ ముందుండి ఉద్యమాన్ని నడిపించారు. అలాంటి అద్వానీ ప్రభ మోదీ అధికారంలోకి వచ్చాక మసకబారింది. ఆయనను కావాలనే పక్కనపెట్టారనే మరక మోదీపై ఉంది. సొంతపార్టీలోనూ ఇదే అభిప్రాయం వ్యక్తమైనా అందరూ గుంభనంగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో అద్వానీకి భారతరత్న ప్రకటించి తనపై పడిన మచ్చను చెరిపేసుకోవడంతోపాటు తమకు దూరమైన వర్గాలను దగ్గరికి చేర్చుకోవాలని యోచిస్తున్నది. ఓ వైపు అయోధ్య, మరోవైపు అద్వానీ.. ఈ పరిస్థితులన్నీ తమకు అనుకూలంగా మారాక ఎన్నికల షెడ్యూల్ వచ్చేలా కేంద్రం పావులు కదిపినట్టు చెప్తున్నారు.

ఖమ్మం నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆటో ఎక్స్‌పోను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా రవాణాశాఖ అధికారి మహ్మద్ గౌస్‌పాషా, నమస్తే తెలంగాణ అడ్వర్టైజ్‌మెంట్ జీఎం ఎన్ సురేందర్‌రావు.. ఆటోషోను సందర్శిస్తున్న ప్రజలు

ఒకే వేదికపై అన్ని కంపెనీల వాహనాలు

- రుణ సదుపాయాల కల్పనకు అందుబాటులో బ్యాంకర్లు
- ఖమ్మంలో 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ఆటో ఎక్స్‌పో
- తొలి రోజే భారీగా పోటెత్తిన సందర్శకులు.. కిటకిటలాడిన స్టాళ్లు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 3: వాహన ప్రేమికుల కోసం ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో ఆటో ఎక్స్‌పో ఏర్పాటైంది. 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనను ఖమ్మం జిల్లా పరిషత్ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా రవాణాశాఖ అధికారి మహ్మద్ గౌస్, నమస్తే తెలంగాణ అడ్వర్టైజ్‌మెంట్ జీఎం ఎన్ సురేందర్‌రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాహన కొనుగోలుదారుల సౌలభ్యం కోసం వివిధ ఆటోమొబైల్ కంపెనీలను, బ్యాంకర్లను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. సామాన్యుల నుంచి కోటీశ్వరుల వరకు అందరినీ ఆకట్టుకునేలా ఈ ఎక్స్‌పోలో వివిధ కంపెనీల కార్లు, బైక్‌లు కొలువుదీరాయి. దీంతో తొలి రోజే ఈ ప్రదర్శన కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సందర్శకులు ఆయా స్టాళ్ల వద్దకు వెళ్లి వాహనాల వివరాలు, రుణ సదుపాయాల గురించి తెలుసుకున్నారు. కొందరు సందర్శకులు అక్కడికక్కడే వాహనాలను బుక్ చేసుకున్నారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా రవాణాశాఖ ప్రాంతీయ కార్యాలయ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్ రమేశ్, బ్యూరో ఇన్‌చార్జి మాటేటి వేణు, అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ బోయిన శేఖర్ బాబు, సర్క్యులేషన్ మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రయోజనార్థమే..

ప్రజల ప్రయోజనార్థమే 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ప్రాపర్టీ షో, ఆటో షోలు నిర్వహిస్తున్నాయి.. గతంలో ఇలాంటి షోలు ఢిల్లీ, హైదరాబాద్ వంటి మహా నగరాలకే పరిమితమయ్యేవి. అన్ని జిల్లాల్లో ఆటో షోలు నిర్వహించి వాహనప్రియుల కలను సాకారం చేస్తున్నాం. ఇక ముందు కూడా మరిన్ని షోలు నిర్వహిస్తాం. అన్ని రకాల వాహనాలు ఒకే వేదిక మీదకి తీసుకొని రావడం వల్ల కొనుగోలు దారులు అన్ని బేరీజు వేసుకొని నిర్ణయాన్ని తీసుకోవాడానికి అనువైన అవకాశాల్ని కలిపిస్తున్నాం, అలాగే అదే వేదిక పై బ్యాంకులని కూడా అందుబాటులోకి తీసుకొచ్చాము.

- ఎన్ సురేందర్ రావు, నమస్తే తెలంగాణ అడ్వర్టైజ్‌మెంట్ జనరల్ మేనేజర్

లోకం పోకడ

'ఏప్రిల్ ఫస్ట్' మంచి రోజు.. అన్ని గ్యారెంటీలు అమలు చేస్తామని కనీసం ఆ రోజన్నా చెప్పండి సార్!

పద్మ అవార్డు గ్రహీతలకు నేడు సర్కారు సత్కారం

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): తాజాగా పద్మ అవార్డులు పొందిన తెలుగువారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం సత్కరించనున్నది. హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఉదయం వేళ సీఎం రేవంత్‌రెడ్డి అవార్డు గ్రహీతలను సత్కరిస్తారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎనిమిది మందికి పద్మ అవార్డులు వరించాయి. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, సినీనటుడు చిరంజీవికి కేంద్రం పద్మవిభూషణ్ ప్రకటించింది. చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య, స్థపతి వేలు ఆనందాచారి, బుర్రవీణ కథకుడు దాసరి కొండప్ప, కవి కూరెళ్ల విఠలాచార్య, సంగీత కళాకారుడు కేతావత్ సోమాలాల్, సంగీత నాటక కళాకారిణి ఉమామహేశ్వరికి పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించింది.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	14.2°c	34.3°c
రంగారెడ్డి	16.0°c	35.6°c
మెదక్	18.1°c	35.0°c
వరంగల్	19.0°c	31.0°c
కరీంనగర్	19.0°c	32.0°c
ఖమ్మం	20.0°c	33.0°c
నిజామాబాద్	20.1°c	34.0°c
మహబూబ్‌నగర్	20.2°c	32.9°c
నల్లగొండ	20.5°c	34.5°c
హైదరాబాద్	21.7°c	30.8°c

'నమస్తే' ప్రాపర్టీషో గ్రాండ్ సక్సెస్

- రియల్టర్లు, బ్యాంకర్ల స్టాళ్లన్నీ కిటకిట
- పెద్ద సంఖ్యలో పోటెత్తిన సందర్శకులు
- మళ్లీ మళ్లీ ఏర్పాటు చేయాలని సూచన
- ప్రదర్శన నిర్వాహకులకు కృతజ్ఞతలు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 3: ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు హనుమకొండలోని కాకతీయ హరిత హోటల్‌లో 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' పత్రికలు సంయుక్తంగా నిర్వహించిన ప్రాపర్టీషో గ్రాండ్ సక్సెస్ అయింది. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, బ్యాంకులు ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాళ్లకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. టీఎన్జీవో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కార్యదర్శి బైరి సోమయ్య, కేంద్ర సంఘం నాయకులు శ్యాం సుందర్, రామునాయక్, జిల్లా నాయకులు రాజేశ్ ఖన్నా, మల్లేశం, మహబూబ్, కుమార్, టీఎన్జీవో వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాంకిషన్, కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ వీరగంటి రవీందర్ తదితరులతోపాటు ఎంతో మంది ప్రజలు ఈ స్టాళ్లను సందర్శించారు. వివిధ ప్రాంతాల్లోని వెంచర్లు, అపార్ట్‌మెంట్లు, ఇండ్లు, ఇండ్ల స్థలాల వివరాలతోపాటు వాటి కొనుగోలుకు బ్యాం కర్లు కల్పిస్తున్న రుణ సదుపాయాల గురించి తెలుసుకున్నారు. స్థిరాస్తుల కొనుగోలుకు ఎంతో ఉపకరిస్తున్న ఇలాంటి ప్రాపర్టీషోలను మళ్లీ మళ్లీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రదర్శనను నిర్వహించిన 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' పత్రికలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఈ ప్రాపర్టీషో నిర్వాహకులు లక్కీడ్రా ద్వారా పలువురు కస్టమర్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో 'నమస్తే తెలంగాణ' బ్రాంచ్ మేనేజర్ పందిళ్ల అశోక్‌కుమార్, బ్యూరో ఇంచార్జి పిన్నింటి గోపాల్, అడ్వర్టైజ్‌మెంట్ డిప్యూటీ మేనేజర్ అప్పని సూరి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ ప్రాపర్టీ షోలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఉత్తముచ్చటేనా?

మొదటిపేజీ తరువాయి...

తప్పుపడుతున్నారు తప్ప వారు కూడా స్పష్టత నివ్వడం లేదు. మరోవైపు ప్రాజెక్టుల స్వాధీనానికి సంబంధించి కేంద్రజల్‌శక్తిశాఖ, ఇంకోవైపు ఏపీ ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతున్నాయి. తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతున్నా.. కంటితుడుపుగా సదరు మంత్రి గతంలో ఒక ప్రకటన ఇచ్చి చేతులు దులుపుకున్నారు తప్ప పత్రికాముఖంగా ఇప్పటివరకు ఒక్క ప్రకటనా చేయలేదు. అసలు అమాత్యులు ఉన్నారా? ఉంటే ఆయనకు తెలిసే ప్రాజెక్టులను, ఔట్‌లెట్లను అప్పగించారా అంటూ తెలంగాణవాదులు ప్రశ్నిస్తున్నారు. అయితే ప్రభుత్వ లోగుట్టు బయటపడటంతోనే అమాత్యులు ముఖం చాటేశారని చెప్పుకుంటున్నారు.

మంత్రివర్యులు మాట్లాడరేం..?

ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేందుకు ఏపీతోసహా తెలంగాణ సర్కారు అంగీకరించాయని కేంద్ర జల్‌శక్తి శాఖ, కేఆర్‌ఎంబీ సమావేశాల మినిట్స్ స్పష్టం చేస్తున్నాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన 15 ఔట్‌లెట్లను అప్పగించేందుకు ఏపీ అంగీకరించగా, తెలంగాణ మాత్రం 15 ఔట్‌లెట్లలో విద్యుత్తు ప్రాజెక్టులు మినహాయించి మిగిలిన వాటి అప్పగింతకు అంగీకారం తెలిపినట్టు స్పష్టమవుతున్నది. తెలంగాణ ఈఎన్సీ మురళీధర్ సైతం ఇకపై బోర్డు నిర్వహణలోనే ప్రాజెక్టులు ఉంటాయని పత్రికాముఖంగా వెల్లడించారు. ఇరిగేషన్‌శాఖ సెక్రటరీ మాత్రం పత్రికలే తప్పుడు కథనాలు ప్రచురించాయని, ప్రాజెక్టులను అప్పగించలేదని పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారు. ఒకవైపు తెలంగాణ జలహక్కులకు తీవ్ర విఘాతం వాటిల్లుతున్నా, దీనిపై ఇంత రభస జరుగుతున్నా, తెలంగాణ సమాజంలో ఆందోళన నెలకొన్నా ఇప్పటివరకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాత్రం ఎక్కడా ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం గమనార్హం.

లోగుట్టు బయటపడటంతోనే..

ప్రాజెక్టుల అప్పగింతకు తెలంగాణ అంగీకారం తెలిపిందని పత్రికల్లో వార్తలు వచ్చిన మరుసటి రోజే దానిని ఖండిస్తూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటన చేశారు. హడావుడిగా ఇరిగేషన్ అధికారులతో సమీక్షన మంత్రి.. దాదాపు 15రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు మళ్లీ ఆ ఊసేత్తలేదు. బోర్డుకు ప్రాజెక్టులు అప్పగిస్తున్నారా? లేదా? అన్న అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కానీ, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కానీ ఇప్పటికీ నోరు మెదపడంలేదు. అసలు ప్రభుత్వ మార్గదర్శకాలు లేకుండా అధికారులే సొంతంగా, రాష్ట్ర జలహక్కులను కాలరాసేలా ఇంత పెద్ద నిర్ణయం ఎలా తీసుకుంటారని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళా తీసుకున్నా తెలంగాణ ప్రయోజనాలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. తెలంగాణకు అత్యంత ఆవశ్యకమైన అంశమైనప్పటికీ.. ప్రభుత్వం, మంత్రి మౌనం వీడడం లేదు.

16న మరోసారి సమావేశం..

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): ప్రాజెక్టుల స్వాధీనానికి సంబంధించి తాజాగా ఈనెల 16న మరోసారి సమావేశం నిర్వహించాలని కేంద్రజలశక్తిశాఖ నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర జలశక్తిశాఖ కార్యదర్శి దేబశ్రీముఖర్జీ తెలంగాణ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారికి, ఏపీ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహార్‌రెడ్డికి, కేఆర్‌ఎంబీ చైర్మన్ శివనందన్‌కుమార్‌కు లేఖ రాశారు. పూర్తి యాక్షన్‌ప్లాన్‌తో సమావేశానికి రావాలని ఇరు రాష్ట్రాలను ఆదేశించారు. మొత్తంగా నెలరోజుల్లోగా ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవాలనే లక్ష్యంతో కేంద్రం వేగంగా అడుగులు వేస్తున్నదని తేటతెల్లమవుతున్నది. ఇప్పటికే ఏపీ సైతం అందుకు ఉత్సాహాన్ని చూపుతున్నది. ఇదే జరిగితే తెలంగాణ జలహక్కులకు తీవ్ర విఘాతం వాటిల్లనుంది.

కృష్ణా జలాలపై పర్యవేక్షణ తెలంగాణకే ఉండాలి

- సూర్యాపేట జడ్పీ ఏకగ్రీవ తీర్మానం

సూర్యాపేట, ఫిబ్రవరి 3 : కృష్ణా నదీ జలాల పర్యవేక్షణ బాధ్యత తెలంగాణ ప్రభుత్వానికే ఉండాలని పేర్కొంటూ సూర్యాపేట జిల్లా పరిషత్ ఏకగ్రీవ తీర్మానం చేసింది. శనివారం జడ్పీ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ.. కృష్ణా జలాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరును తప్పుబట్టారు. కృష్ణా జలాలపై రాష్ట్రం హక్కులను తీసివేసిందంటే తెలంగాణ హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తున్నట్లేనని మండిపడ్డారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని జలశక్తికి అప్పగించడం సరికాదని అన్నారు. దీనివల్ల ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగం తీవ్ర అన్యాయానికి గురవుతుందని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు, ఉమ్మడి జిల్లాకు తాగునీరు అందించే కృష్ణా నది ఇప్పటికే ఏడారిగా మారుతున్నట్టు చెప్పారు. కృష్ణా ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. గతంలో బీజేపీ ప్రభుత్వం ఈ కుట్రలు చేస్తే అప్పటి సీఎం కేసీఆర్, అప్పటి మంత్రి హరీశ్‌రావు సమర్థవంతంగా తిప్పికొట్టారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. 'మన రాష్ట్రం- మన ప్రాజెక్టు-మన హక్కు' అనే నినాదంతో ఏకగ్రీవంగా తీర్మానం చేయాలని ఎంపీ కోరగా సభ్యులు మద్దతు పలికి తీర్మానం చేశారు.



సూర్యాపేట జడ్పీ సర్వసభ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

ఏపీకి నీళ్లు.. మహారాష్ట్రకు వేడుకోలు!

- ఇప్పటికే సాగర్ నుంచి ఏపీకి అదనంగా 5 టీఎంసీలు
- తాజాగా మరో రెండు టీఎంసీల నీటికి అనుమతి
- అటు 'కొయినా' కోసం సర్కారు సంప్రదింపులు!

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్‌లో తీవ్ర నీటి కొరత నెలకొన్నదని చెప్తూ మహారాష్ట్రను ఒప్పించి కొయినా డ్యామ్ నుంచి నీళ్లను తీసుకురావాలని యత్నిస్తున్న కాంగ్రెస్ సర్కారు.. సాగర్‌లో ఉన్న నీళ్లను ఉదారంగా ఏపీకి ధారాదత్తం చేస్తున్నది. ఇప్పటికే 5 టీఎంసీల వినియోగానికి అవకాశం ఇవ్వగా, తాజాగా మరో 2 టీఎంసీలను అదనంగా వాడుకునేందుకు అనుమతివ్వటం గమనార్హం. మే చివరి వరకు ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల అంశంపై కేఆర్‌ఎంబీ మెంబర్ సెక్రటరీ, తెలంగాణ ఈఎన్సీ మురళీధర్, ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డితో కూడిన త్రిసభ్య కమిటీ గత అక్టోబర్‌లో సమావేశమైంది. ఇరు రాష్ట్రాలకు నీటి అవసరాల ఇండెంట్లను బోర్డుకు నివేదించాయి. రెండు ప్రాజెక్టుల్లో 80 టీఎంసీలు వినియోగానికి అందుబాటులో ఉన్నాయని తేల్చారు. అందులో 35 టీఎంసీలను తెలంగాణకు, 45 టీఎంసీలను ఏపీకి కేటాయించారు. అందులో శ్రీశైలం నుంచి 30, సాగర్ నుంచి 15 టీఎంసీలను ఏపీ వినియోగించుకోవాల్సి ఉన్నది. ఎగువన శ్రీశైలంలో నీటిని వాడుకోలేకపోయామని, సాగర్ నీటిని వాడుకుంటామని చెప్పి ఇప్పటికే ఏపీ 5 టీఎంసీలను వినియోగించుకున్నది. ఇప్పుడూ అదే సాకుతో ఫిబ్రవరికి సాగర్ ఎడమ కాలువ ద్వారా మరో 2 టీఎంసీలను విడుదల చేయాలని ఏపీ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు తెలంగాణ సర్కారు అనుమతివ్వటం గమనార్హం. సాగర్‌లో నీటి కొరత ఉన్నదని చెప్పి, ఆ నీటినే వాడుకోవటానికి అనుమతి ఇవ్వటం ఏమిటని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

పొలం ఎండి.. కాల్వకు గండి!

- ఎస్సారెస్పీ సబ్ కెనాళ్లకు గండి కొట్టిన రైతులు
- పెద్దపల్లి మండలం దస్తగిరిపల్లి వద్ద కాల్వ ధ్వంసం
- పంటలు ఎండటంతో కడుపుమండిన అన్నదాతలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 3: కాల్వ నీటిపై ఆధారపడి వేసిన పంట ఎండుతున్నది.. ఆరుగాలం పడిన కష్టం మంటగలుస్తున్నది. దీంతో కడుపుమండిన రైతు కాల్వకు గండి కొట్టి పంటను కాపాడుకొనేందుకు ప్రయత్నిస్తున్నాడు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఎస్సారెస్పీ కెనాళ్లకు గండ్లు పెట్టి అన్నదాతలు నీటిని తరలించుకుపోతున్నారు. పెద్దపల్లి మండలం దిగువన కాల్వశ్రీరాంపూర్ మండలంలో ఒకప్పుడు హుస్సేన్‌మియా వాగుతోపాటు ఎస్సారెస్పీ కాలువ ద్వారా పుష్కలంగా జలాలు అందేవి. ఈ సీజన్‌లో హుస్సేన్‌మియా వాగు నుంచి పరిసర గ్రామాల్లోని పొలాలకు నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. ఇటీవలే హుస్సేన్‌మియా వాగుపై పెద్దపల్లి మండలం భోజన్నపేట-మూలసాల మధ్య చెక్‌డ్యాంను పేల్చేందుకు కొందరు ప్రయత్నించారు. ఈ ఘటన మరువకముందే శనివారం ఎస్సారెస్పీ 10ఎల్ కాలువకు పెద్దపల్లి మండలం దస్తగిరిపల్లి వద్ద దిగువ రైతులు గండిపెట్టారు. కాలువకు అడ్డుకట్ట వేసి నీటిని మళ్లించారు. ఇక్కడి నుంచి నీటిని సమీపంలోని కొత్తపల్లి వాగుకు తరలించుకొని, అక్కడి నుంచి హుస్సేన్‌మియా వాగుకు మళ్లించుకున్నారు. దీంతో నీరంతా దిగువకు ఉరకలు వేస్తుండగా, దస్తగిరిపల్లి రైతులు ఆందోళన చెందుతున్నారు. నీరంతా దిగువకు వెళ్తే తమ పరిస్థితి ఏం టని, అధికారుల, లస్కర్ల పర్యవేక్షణలోపంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని మండిపడుతున్నారు. ఇరిగేషన్ అధికారులు తమకు సమాచారం లేదని చెప్పడం గమనార్హం.

సాగర్.. ఇక ఎడారే!

మొదటిపేజీ తరువాయి...

రూపొందించిన రూల్‌కర్వ్, ఆపరేషన్ ప్రొటోకాలే కారణం. అందులోని నిబంధనలు తెలంగాణకు తీరని శాపాలుగా మారే ప్రమాదం ఉన్నది. ఈ నేపథ్యంలోనే ఆ ముసాయిదాను కేసీఆర్ ప్రభుత్వం తీవ్రంగా తప్పుబట్టింది. ముసాయిదా ట్రిబ్యునల్, ప్లానింగ్ కమిషన్ అనుమతులకు విరుద్ధమని తప్పుబట్టింది. సీడబ్ల్యూసీ ప్రొటోకాల్ పూర్తిగా ఏపీకి వత్తాసు పలికేలా ఉందని తేల్చిచెప్పింది. ముసాయిదాపై చర్చించేందుకు కేఆర్‌ఎంబీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్‌ఎంసీ) సమావేశాల్లోనే అనేకమార్లు బీఆర్‌ఎస్ సర్కారు తేల్చి చెప్పింది. ఆ రెకమండేషన్లను తిరస్కరించింది. కేంద్రానికి, కేఆర్‌ఎంబీకి గతంలోనే ఈ మేరకు లేఖలు రాసింది. కానీ ఇప్పుడు అందుకు సంబంధించి ఆపరేషన్ ప్రొటోకాల్‌పై నిర్ణయం జరగకముందే ప్రాజెక్టుల నిర్వహణను బోర్డుకు అప్పగించేందుకు కాంగ్రెస్ సర్కారు అంగీకరించడం విషాదకరం.

ఎల్లకాలం సాగర్ ఎండాల్సిందే

బచావత్ ట్రిబ్యునల్ అవార్డు, ప్లానింగ్ కమిషన్ నిబంధనల ప్రకారం శ్రీశైలం జలవిద్యుత్తు ప్రాజెక్టు మాత్రమే. నాగార్జునసాగర్‌కు ప్రత్యేకంగా ఎలాంటి క్యాచ్‌మెంట్ ఏరియా లేదు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచే జలవిద్యుత్తు ఉత్పత్తి ద్వారా సాగర్ రిజర్వాయర్‌కు నీరు అందుతుందని వెల్లడించాయి. సాగర్, శ్రీశైలం రిజర్వాయర్లు పూర్తిగా ఒకదానిపై ఒకటి ఆధారపడిన ప్రాజెక్టులు అని, ఆ రెండింటికి సంబంధించి సమగ్రమైన ప్రొటోకాల్స్‌ను, అదీ ట్రిబ్యునల్ అవార్డులకు అనుగుణంగా రూపొందించాల్సి ఉన్నది. కానీ కేఆర్‌ఎంబీ అందుకు విరుద్ధంగా ప్రొటోకాల్‌ను రూపొందించింది. 830 ఫీట్ల వరకు జల విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ దిగువన సాగర్‌కు విడుదల చేస్తూ దానికింది ఆయకట్టుకు నీరందించాల్సి ఉన్నది. కానీ ట్రిబ్యునల్ అవార్డులకు విరుద్ధంగా సీడబ్ల్యూసీ రూల్‌కర్వ్‌ను ప్రతిపాదించింది. శ్రీశైలం రిజర్వాయర్ ఎండీడీఎల్‌పై ఆంక్షలు విధించింది. 854 ఫీట్లపైనే విద్యుత్తు ఉత్పత్తి చేపట్టాలని రూపొందించింది. అదే జరిగితే ఎగువ నుంచి వచ్చిన జలాలను వచ్చినట్టుగా పోతిరెడ్డిపాడు ద్వారా పెన్నా బేసిన్‌కు ఏపీకి తరలించుకుపోయే అవకాశం ఉన్నది. దీంతో సాగర్ ఆయకట్టు ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉన్నది. వాస్తవంగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా చెన్నై తాగునీటి అవసరాలకు 15 టీఎంసీలు, శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్ (ఎస్‌ఆర్‌బీసీ)కి 19 టీఎంసీలు.. మొత్తంగా 34 టీఎంసీలను మాత్రమే తరలించుకుపోయేందుకు ఏపీకి అవకాశం ఉన్నది. అయినా ట్రిబ్యునల్ అవార్డును పట్టించుకోకుండా ఏడేండ్లలో జల వినియోగాల ఆధారంగా ప్రొటోకాల్‌ను రూపొందించింది. ఇది తెలంగాణకు తీవ్రంగా చేటు చేయనున్నది. నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీని మరింత విస్తరించుకుంటూ పోతున్నది. ఏకంగా 88 వేల క్యూసెక్కులకు పెంచుతున్నది. రాబోయే రోజుల్లో ఏపీ పెద్ద మొత్తంలో జలాలను బేసిన్ అవతలికి తరలించే అవకాశం ఉన్నది. ఇక భవిష్యత్తులో సాగర్‌కు నీళ్లు వస్తాయా? అన్నది అనుమానమే. ఏపీని అడ్డుకునేదెలా? అని ఇంజినీర్లు ప్రశ్నిస్తున్నారు.

జలవిద్యుత్తుపై ఆశలు వదులుకోవాల్సిందే

తెలంగాణ భౌగోళిక పరిస్థితులు, అవసరాలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు శ్రీశైలం జలవిద్యుత్తు ప్రాజెక్టులు అత్యవసరం. 100 శాతం స్థాపిత సామర్థ్యం మేరకు జలవిద్యుత్తు చేపట్టాలని గత ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్ణయించడంతోపాటు జీవోను కూడా విడుదల చేసింది. బోర్డు చేతికి ప్రాజెక్టులు పోతే ఇప్పుడు తెలంగాణకు ఆ అవకాశం ఉండదు. 854 ఫీట్లపైన జలాలు ఉంటేనే, అదీ బోర్డు అనుమతిస్తేనే విద్యుత్తు ఉత్పత్తి చేస్తారు. ఇది తెలంగాణకు తీవ్ర నష్టం చేకూర్చుతుంది. ఉత్పత్తి చేసిన విద్యుత్తును 50:50 నిష్పత్తిలో ఏపీతో పంచుకోవాల్సిన దుస్థితి ఏర్పడనున్నది. ఈ మేరకు ఆపరేషన్ ప్రొటోకాల్‌లో సీడబ్ల్యూసీ ప్రతిపాదనలను పొందుపరిచింది.

నికర జలాలను కోల్పోవాల్సిన ప్రమాదం

ఆపరేషన్ ప్రొటోకాల్ ముసాయిదా ప్రతిపాదనలతో తెలంగాణ 45 టీఎంసీల నికర జలాలను కోల్పోవాల్సి వస్తున్నది. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు మళ్లిస్తే, సాగర్ ఆయకట్టు నీటి లో 80 టీఎంసీలను నిలిపివేయాల్సి ఉంటుంది. ఆ మొత్తం నీళ్లను కృష్ణా బేసిన్ రాష్ట్రాలైన నాటి ఉమ్మడి ఏపీకి 45 టీఎంసీలు, కర్ణాటకకు 21, మహారాష్ట్రకు 14 టీఎంసీల వాటాను కేటాయించాలి. ఉమ్మడి ఏపీకి సంబంధించి ఆ నీటిని సాగర్ ప్రాజెక్టున ఎగువన మాత్రమే, అదీ ఇన్‌బేసిన్ ప్రాజెక్టులకే వినియోగించుకోవాలని ట్రిబ్యునల్ స్పష్టంగా చెప్పింది. తెలంగాణ తన నీటి వాటా 45 టీఎంసీలతోపాటు, మైనర్ ఇరిగేషన్‌లో మిగులుతున్న మరో 45 టీఎంసీలను మొత్తంగా 90 టీఎంసీలను పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించింది. ప్రస్తుతం ఆపరేషన్ ప్రొటోకాల్‌లో ఆ 45 టీఎంసీలను క్యారీఓవర్ కింద ప్రతిపాదించారు. రేపు అదే జరిగితే కేటాయించిన నికర జలాలను తెలంగాణ కోల్పోవాల్సి వస్తుందని నీటిరంగ నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

సాగునీటి నిర్వహణ సర్కారుకు చేతకాదా?

- ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించడం రేవంత్‌రెడ్డి సర్కారు అసమర్థతకు నిదర్శనం
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఫైర్
- జూరాల ప్రాజెక్టుపై రైతులతో కలిసి ధర్నా

గద్వాల, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో సాగునీటి నిర్వహణ కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతగాకనే ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించిందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేఆర్‌ఎంబీ పరిధిలోకి ప్రాజెక్టులను అప్పగించడాన్ని నిరసిస్తూ శనివారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై రైతులతో కలిసి ఎమ్మెల్యే బండ్ల ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసమర్థ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కృష్ణా జలాల కోసం మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం 15 ఔట్‌లెట్స్‌ను కేఆర్‌ఎంబీకి అప్పగించకపోతే వాటి నిర్వహణకు సిబ్బంది, నిధులు కావాలని బోర్డు చైర్మన్ ఎందుకు అడిగారని ప్రశ్నించారు. మాయమాటలతో ప్రజలను నమ్మించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. కృష్ణా నదీ జలాల పంపిణీ అంశం ట్రిబ్యునల్ వద్ద తేలకముందే కాంగ్రెస్ సర్కారు ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించడంతో రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీకి దాసోహమైనట్టు స్పష్టమవుతున్నదని మండిపడ్డారు. తెలంగాణ ప్రాజెక్టుల ఔట్‌లెట్స్‌ని ఈఎన్‌సీ బోర్డుకు అప్పగించారనే విషయం బోర్డు సమావేశ మినిట్స్ ద్వారా వెల్లడవుతున్నదని చెప్పారు. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు ఆలోచించడం లేదని నిలదీశారు. తెలంగాణకు ప్రాణప్రదమైన కృష్ణా జలాల హక్కులపై ఇంత వివాదం జరుగుతుంటే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎక్కడ నిద్రపోతున్నాడని ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతలకు వరద జలాల్లో 40 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయని, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వృధాగా మారుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ధర్నాలో రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.